అభిషేక్ @ 2

• ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్

దుబాయ్: టీ20 ఫార్మాట్‌లో వరుస విజయాలతో దూసుకుపోతున్న యువ భారత జట్టు ఐసీసీ ర్యాంకింగ్స్‌లోనూ దుమ్మురేపుతోంది. బంతిని బాదడంలో కొత్త రికార్డులు నెలకొల్పుతున్న యువ ఓపెనర్ అభిషేక్ శర్మ.. ఐసీసీ ర్యాంకింగ్స్‌లో ఏకంగా 38 ర్యాంక్‌లు మెరుగుపరుచుకుని రెండో ర్యాంక్‌కు ఎగబాకాడు. ఈ పంజాబ్ కుర్రాడు.. ఇంగ్లీష్ బౌలర్లకు చుక్కలు చూపించి 54 బంతుల్లోనే 135 పరుగులు చేయడంతో అతడి ర్యాంకు రాకెట్ స్పీడ్‌తో దూసుకెళ్లింది. ఈ జాబితాలో ట్రావిస్ హెడ్ టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా తిలక్ వర్మ మూడు, సూర్యకుమార్ యాదవ్ 5వ ర్యాంక్‌లో ఉన్నారు. బౌలర్లలో వరుణ్ మూడు ర్యాంక్‌లు మెరుగుపరుచుకుని రెండో ర్యాంక్‌కు చేరాడు.

రోహిత్.. ఏం చేద్దామనుకుంటున్నావ్?

ముంబై: టీమ్‌ఇండియా వన్డే, టెస్టు సారథి రోహిత్ శర్మ అంతర్జాతీయ క్రికెట్ కెరీర్ వీడ్కోలుకు సమయం ఆసన్నమవుతోందా? ఇటీవల కాలంలో వరుస సిరీస్ ఓటములకు తోడు వ్యక్తిగతంగా పేలవ ఫామ్, వయసు, ఇతరత్రా కారణాలతో రోహిత్ భవిష్యత్‌పై నీలినీడలు కమ్ముకున్నాయి. దీనిపై బీసీసీఐ కూడా రోహిత్‌ను 'ఫ్యూచర్ ప్లాన్స్' ఏంటని ఆరా తీసినట్టు బోర్డు వర్గాల సమాచారం.

రషీద్ ప్రపంచ రికార్డు

గెబెహ: అఫ్గానిస్థాన్ స్టార్ స్పిన్నర్ రషీద్ ఖాన్ టీ20 క్రికెట్‌లో ప్రపంచ రికార్డు నెలకొల్పాడు. ఈ ఫార్మాట్‌లో అత్యధిక వికెట్లు తీసిన బౌలర్ (633 వికెట్లు)గా రషీద్ నిలిచాడు. తద్వారా గతంలో వెస్టిండీస్ దిగ్గజం డ్వేన్ బ్రావో పేరిట ఉన్న 631 వికెట్ల రికార్డు కనుమరుగైంది. దక్షిణాఫ్రికా వేదికగా జరుగుతున్న ఎస్ఏ20లో ఎంఐ కేప్‌టౌన్ తరపున ఆడుతున్న రషీద్.. పార్ల్ రాయల్స్‌తో జరిగిన మ్యాచ్‌లో 2వికెట్లు పడగొట్టి ఈ ఘనతను సాధించాడు.

త్రిషకు కోటి నజరానా

యువ క్రికెటర్‌కు సీఎం రేవంత్‌రెడ్డి అభినందన

హైదరాబాద్, ఆట ప్రతినిధి: ప్రతిష్ఠాత్మక అండర్-19 టీ20 ప్రపంచ కప్ సాధించిన భారత జట్టు సభ్యురాలైన తెలంగాణ యువ క్రికెటర్ గొంగడి త్రిషకు తగిన ప్రోత్సాహం లభించింది. వరుసగా రెండోసారి ప్రపంచకప్ గెలువడంలో కీలకంగా వ్యవహరించిన భద్రాచలం అమ్మాయి త్రిషకు రాష్ట్ర ప్రభుత్వం కోటి రూపాయల నజరానా ప్రకటించింది. బుధవారం హైదరాబాద్‌లో త్రిషను సీఎం రేవంత్‌రెడ్డి శాలువ, జ్ఞాపికతో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భవిష్యత్‌లో మరింతగా రాణించి రాష్ట్ర ఖ్యాతిని ఇనుమడింపజేయాలన్నారు. త్రిషతో పాటు ప్రపంచకప్ విజయంలో భాగమైన క్రికెటర్ కేసరి ధ్రుతి, చీఫ్ కోచ్ నౌషిన్ అల్‌ఖదీర్, ట్రైనర్ షాలిని 10 లక్షల చొప్పున నగదు ప్రోత్సాహం ప్రకటించారు. ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సాట్స్ చైర్మన్ శివసేనారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారి పాల్గొన్నారు.

శభాష్ హాసిని

డెహ్రాడూన్‌లో జరిగిన జాతీయ తైక్వాండో చాంపియన్‌షిప్‌లో పసిడి పతకం సాధించిన అంబటి హాసినిని బుధవారం హైదరాబాద్‌లో అభినందిస్తున్న బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

మెరిసిన మోహిత్

హైదరాబాద్, ఆట ప్రతినిధి: హైదరాబాద్‌కు చెందిన టీఎన్ఆర్ మోహిత్..దేశవాళీ టోర్నీ రంజీల్లో అదరగొట్టాడు. ప్రస్తుత సీజన్‌లో అరుణాచల్‌ప్రదేశ్ తరపున బరిలోకి దిగిన మోహిత్ ఆఫ్ స్పిన్ బౌలింగ్‌కు తోడు బ్యాటింగ్‌తో జట్టు విజయాల్లో కీలకంగా వ్యవహరించాడు. తన ఆఫ్ స్పిన్ మాయాజాలంతో ఈ సీజన్‌లో 16 వికెట్లు ఖాతాలో వేసుకున్నాడు. అహ్మదాబాద్ వేదికగా సిక్కింతో జరిగిన మ్యాచ్‌లో మోహిత్ తొలి ఇన్నింగ్స్‌లో 3/89 తో పాటు మలి ఇన్నింగ్స్‌లో 6/38 అద్భుత ప్రదర్శన కనబరిచి కెరీర్ బెస్ట్ నమోదు చేసుకున్నాడు. మరోవైపు సయ్యద్ ముస్తాక్ అలీ టీ20 టోర్నీలోనూ మోహిత్ సత్తాచాటాడు.

'చాంపియన్స్'కు సన్నాహం

నేడు భారత్, ఇంగ్లండ్ తొలి వన్డే • తుది కూర్పే అసలు సమస్య • 'రోకో'పైనే అందరి దృష్టి

రోహిత్

నాగ్‌పూర్: మరికొద్దిరోజుల్లో పాకిస్థాన్, దుబాయ్ వేదికలుగా మొదలుకాబోయే ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీకి ముందు తమ బలం, బలహీనతలేంటో తెలుసుకోవడంతో పాటు తప్పొప్పులను సరిదిద్దుకోవడానికి భారత క్రికెట్ జట్టుకు సువర్ణావకాశం. మూడు మ్యాచ్‌ల వన్డే సిరీస్‌లో భాగంగా భారత్, ఇంగ్లండ్ మధ్య గురువారం నాగ్‌పూర్‌లో తొలి వన్డే జరుగనుంది. గతేడాది ఆగస్టులో శ్రీలంకతో వన్డే సిరీస్ తర్వాత టీమ్‌ఇండియా ఆడబోయే తొలి వన్డే ఇదే. చాంపియన్స్ ట్రోఫీకి సన్నాహకంగా భావిస్తున్న ఈ సిరీస్‌లో 'మెన్ ఇన్ బ్లూ' ఎలా ఆడుతుందనేది ఆసక్తికరం.

ఫోకస్ అంతా రోకో పైనే..

వన్డే ఫార్మాట్‌లో ఆధునిక క్రికెట్‌లో దిగ్గజాలుగా వెలుగొందుతూ టన్నుల కొద్ది పరుగులు, లెక్కకు మిక్కిలి రికార్డులను తమ ఖాతాలో వేసుకున్న టీమ్‌ఇండియా సారథి రోహిత్ శర్మ, రన్ మిషీన్ విరాట్ కోహ్లీ ఫామ్‌పైనే అందరి దృష్టి నెలకొంది. 2023 వన్డే వరల్డ్‌కప్‌లో అత్యధిక పరుగులు సాధించినవారిలో కోహ్లీ (765), రోహిత్ (597) టాప్-2లో ఉన్నారు. కానీ ఆ తర్వాత ఈ ఇద్దరి ఫామ్ క్రమంగా దిగజారుతుండటం జట్టుకు భారీ నష్టాన్ని చేకూర్చుతోంది. ముఖ్యంగా టెస్టులలో ఈ ఇద్దరూ గత న్యూజిలాండ్, ఆస్ట్రేలియా సిరీస్‌లలో ఘోరంగా విఫలమయ్యారు. అదీగాక భారీ అంచనాల మధ్య సుదీర్ఘ విరామం తర్వాత రంజీలలో ఆడినా అక్కడా విఫలమయ్యారు. చాంపియన్స్ ట్రోఫీ వంటి కీలక టోర్నీ ముందున్న నేపథ్యంలో ఈ

బట్లర్

ఇద్దరూ పుంజుకోవడం భారత్‌కు అత్యావశ్యకం. ఈ ద్వయం చెలరేగితే వార్ వన్‌సైడే.

తుది కూర్పు ఎలా?

తుది జట్టులో ఎవరిని ఆడించాలనేది భారత్‌ను వేధిస్తున్న మరో సమస్య. వికెట్ కీపర్‌గా కేఎల్ రాహుల్, రిషభ్ పంత్ మధ్య తీవ్ర పోటీ నెలకొంది. ఓపెనర్లుగా గిల్, రోహిత్ రానుండగా ఆ తర్వాత కోహ్లీ, శ్రేయస్, హార్దిక్‌తో టాపార్డర్ అంతా రైట్ హ్యాండెడ్ బ్యాటర్లే ఉన్నారు. రాహుల్‌ను పక్కనబెట్టి పంత్‌కు చోటిస్తే బ్యాటింగ్ ఆర్డర్‌లో వైవిధ్యం వస్తుంది. కానీ వన్డేలలో రాహుల్ నమ్మదగిన మిడిలార్డర్ ఆటగాడు. వన్డే వరల్డ్‌కప్‌లో అతడి ప్రదర్శనలే ఇందుకు నిదర్శనం. ఒకవేళ రాహుల్, పంత్ ఇద్దరికీ టీమ్ మేనేజ్‌మెంట్ ఓటు వేస్తే శ్రేయస్ బెంచ్‌కే పరిమితమవ్వక తప్పదు. ఇక ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో రీఎంట్రీ ఇచ్చిన సీనియర్ పేసర్ మహ్మద్ షమీతో పాటు స్వల్ప విరామం తర్వాత జట్టులోకి వచ్చిన కుల్‌దీప్ యాదవ్‌కు చాంపియన్స్ ట్రోఫీకి ముందు పూర్తిస్థాయిలో సన్నద్ధమవడానికి ఇదే మంచి అవకాశం. అయితే ఇంగ్లండ్‌తో టీ20 సిరీస్‌లో రాణించిన వరుణ్ చక్రవర్తికి తుది జట్టులో చోటు దక్కే అవకాశమున్న నేపథ్యంలో కుల్‌దీప్, అక్షర్, వాషింగ్టన్‌లలో ఎవరిని పక్కనబెడతారనేది చూడాలి.

రూట్ రీఎంట్రీ

భారత్‌తో టీ20 సిరీస్‌లో చావుదెబ్బ తిన్న ఇంగ్లండ్.. వన్డేలలో మాత్రం బదులు తీర్చుకోవాలని భావిస్తోంది. దాదాపు టీ20లో ఆడిన జట్టుతోనే నాగ్‌పూర్‌లో బరిలోకి దిగనున్న ఇంగ్లండ్ జట్టులో.. స్టార్ బ్యాటర్ జో రూట్ రావడం ఆ జట్టు బలాన్ని మరింత పెంచింది. వన్డే ప్రపంచకప్ తర్వాత రూట్ ఆడనున్న తొలి మ్యాచ్ ఇదే. డకెట్, సాల్ట్, రూట్, బ్రూక్, బట్లర్, లివింగ్‌స్టన్, బెతెల్ వంటి బ్యాటర్లతో ఆ జట్టు బ్యాటింగ్ పటిష్టంగా ఉంది. పేస్ బాధ్యతలను జోఫ్రా ఆర్చర్, సకిబ్ మహ్మద్ మోయనున్నారు.

తుది జట్లు

భారత్ (అంచనా): రోహిత్ శర్మ (కెప్టెన్), శుభ్‌మన్ గిల్, విరాట్ కోహ్లీ, శ్రేయస్ అయ్యర్, కేఎల్ రాహుల్/రిషభ్ పంత్, హార్దిక్ పాండ్యా, రవీంద్ర జడేజా, కుల్‌దీప్ యాదవ్/వరుణ్ చక్రవర్తి, అర్ష్‌దీప్ సింగ్, మహ్మద్ షమీ

ఇంగ్లండ్: బెన్ డకెట్, ఫిల్ సాల్ట్, జో రూట్, హ్యారీ బ్రూక్, జోస్ బట్లర్ (కెప్టెన్) లియామ్ లివింగ్‌స్టన్, జాకబ్ బెతెల్, బ్రైడన్ కార్స్, జోఫ్రా ఆర్చర్, అదిల్ రషీద్, సకిబ్ మహ్మద్

తెలంగాణకు కాంస్యం

38వ జాతీయ క్రీడలు

డెహ్రాడూన్: ఉత్తరాఖండ్ వేదికగా జరుగుతున్న ప్రతిష్ఠాత్మక 38వ జాతీయ క్రీడల్లో తెలంగాణ ఖాతాలో మరో పతకం చేరింది. బుధవారం జరిగిన మహిళల ఆర్చరీ కాంపౌండ్ టీమ్ ఈవెంట్‌లో తెలంగాణకు కాంస్య పతకం దక్కింది. రాష్ట్రం తరపున బరిలోకి దిగిన చికిత, మనసనయన, శేష్ఠరెడ్డి, మన్సూర్ హసిబా 232 స్కోరుతో మూడో స్థానంలో నిలిచింది. ఆఖరి వరకు ఆసక్తికరంగా సాగిన పోటీల్లో తెలంగాణ ఆర్చర్లు అద్భుత ప్రదర్శన కనబరిచారు. ఇదే విభాగంలో పంజాబ్(228), మహారాష్ట్ర(227) ఆర్చర్లు వరుసగా స్వర్ణ, రజత పతకాలు కైవసం చేసుకున్నారు. ఒక స్వర్ణం, మూడు కాంస్యాలతో తెలంగాణ ప్రస్తుతం 25వ స్థానంలో కొనసాగుతున్నది.

అంతర్జాతీయ క్రికెట్ టోర్నీకి ప్రభాకర్

గోపాల్‌పేట, ఫిబ్రవరి 5 : కృషి, పట్టుదల ఉంటే ఏదైనా సాధ్యమనే మాటను నిజం చేస్తూ దివ్యాంగుల క్రికెట్‌లో రాణిస్తున్నాడో యువకుడు. వనపర్తి జిల్లా గోపాల్‌పేట మండల కేంద్రానికి చెందిన దివ్యాంగుడు బెంజిమెన్ ప్రభాకర్ జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించి అంతర్జాతీయ స్థాయికి ఎంపిక య్యాడు. ఫిబ్రవరి 14 నుంచి 19వ తేదీ వరకు ఖాట్మాండ్(నేపాల్)లో జరుగనున్న అంతర్జాతీయ దివ్యాంగుల క్రికెట్ టోర్నీలో భారత్ తరపున ఆడనున్నాడు. మరోవైపు గతేడాది హైదరాబాద్‌లో జరిగిన పారా అథ్లెటిక్స్ షాట్‌పుట్‌లోకాంస్య పతకం దక్కించుకున్నాడు. అంతర్జాతీయ స్థాయిలో రాణించాలనే చిరకాల కోరిక నెరవేరిందనిప్రభాకర్ పేర్కొన్నాడు.

పాకిస్థాన్‌కు వెళ్లను

దుబాయ్: పాకిస్థాన్ ఆతిథ్యమివ్వనున్న ఐసీసీ చాంపియన్స్ ట్రోఫీ నుంచి భారత అంపైర్ నితిన్ మీనన్ తప్పుకున్నాడు. ఐసీసీ ఎలైట్ ప్యానెల్ అంపైర్ల జాబితాలో ఉన్న మీనన్.. భారత్ నుంచి టోర్నీలో ప్రాతినిధ్యం వహించే అవకాశాన్ని దక్కించుకున్న ఒకే ఒక్కడు. కానీ అతడు మాత్రం పాక్‌కు వెళ్లేందుకు నిరాకరించాడు. ఇదే విషయమై బీసీసీఐ ప్రతినిధి ఒకరు స్పందిస్తూ.. 'ఐసీసీ అతడిని చాంపియన్స్ ట్రోఫీ రోస్టర్‌లో ఉంచాలనుకుంది. కానీ ఆయన వ్యక్తిగత కారణాలతో పాక్‌కు వెళ్లడం లేదు' అని తెలిపాడు.

Printed and Published by **Damodar Rao Divakonda**, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No. 437, Near Velama Kalyana Mandapam, Devera Yanjaal, Shamirpet Mandal, Dist: Medchal - 500 078.
Published At Telangana Publications Pvt Ltd. 8-2-603/1/7,8,9. Krishnapuram, Road No.10, Banjara Hills, Hyderabad, 500 034, Telangana State. Editor: **Thigulla Krishna Murthy.** Ph: +91 40 2329 1999, Fax: +91 40 2333 4242, 040-23291118, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/37693.